## 'హనుమాన్'ను తెలుగు స్టైల్ సూపర్ హీరోలా చూపించాం



దర్శకుడు ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న ఫస్ట్ ఇండియన్ ఒరిజినల్ సూపర్ హీరో మూవీ 'హనుమాన్'. తేజ సజ్జా కథా నాయకుడిగా నటించిన ఈ సినిమా ఇప్పటికే గ్లోబల్ లెవల్‌లో క్రేజ్ సంపాదించుకుంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని చైతన్య సమర్పిస్తున్నారు. నేడు విడుదల కానున్న ఈ చిత్ర విశేషాలను ప్రశాంత్ వర్మ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ''హనుమాన్' కోసం తేజను మేకోవర్ చేయించాను. 'జాంబిరెడ్డి'లో సిటీ బాయ్‌లా, ఇందులో పల్లెటూరి కుర్రాడిలా చూపించాం. సినిమాల్లో తేజకు ఇంకా మాస్ ఇమేజ్ రాలేదు. ఈ మూవీలోని పాత్రకు తేజనే కరెక్ట్ అనుకున్నాం. సూపర్ హీరో ఫిల్మ్ టెంప్లేట్‌లోనే ఉంటుందీ మూవీ. 'బ్యాట్‌మెన్' లాంటి సినిమాను రాజమౌళిగారు చేస్తే ఎలా ఉంటుందో ఈ సినిమా అదే తరహాలో ఉంటుంది. 'కేజీఎఫ్'లో యష్‌ని చూపించినట్లే నేను హనుమంతుడిని చూపించబోతున్నాను. 'హనుమాన్' విజయం సాధిస్తే పదేళ్లపాటు గర్వంగా చెప్పుకొనే సినిమాల ప్రణాళిక ఉంది'' అని చెప్పారు.

## 'థగ్‌లైఫ్'తో చరిత్ర సృష్టిస్తాం!





మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ నటించిన 'నాయకన్' (తెలుగులో 'నాయకుడు') చిత్రం ఆల్‌టైమ్ క్లాసిక్స్‌లో ఒకటిగా నిలిచిపోయింది. 37 ఏండ్ల విరామం తర్వాత ఈ ఇద్దరి లెజెండ్స్ కలయికలో 'థగ్‌లైఫ్' పేరుతో చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. పీరియాడిక్ కథాంశంతో భారీ మల్టీస్టారర్‌గా ఈ సినిమా రానుంది. ఇటీవల ఓ అవార్డు వేడుకలో పాల్గొన్న మణిరత్నం 'థగ్ లైఫ్' చిత్రం గురించి మాట్లాడారు. కమల్‌హాసన్‌తో సినిమా తీయడానికి 37 ఏళ్ల విరామానికి గల కారణాలను వివరించారు. 'కమల్‌హాసన్ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయనతో సినిమా తీయాలంటే భారీ హంగులున్న కథ అవసరం. అది ఆయన స్థాయికి సరిపోవాలి. అందుకే ఇన్నేళ్లు వేచిచూశాను. 'థగ్ లైఫ్' కమల్ స్థాయికి తగిన కథ. ఈ సినిమాతో మేం మరోసారి చరిత్ర సృష్టించబోతున్నాం' అని చెప్పారు మణిరత్నం. కొద్ది మాసాల క్రితం విడుదల చేసిన 'థగ్‌లైఫ్' ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన లభించింది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. రాజ్‌కమల్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్ పతాకాలపై కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్.మహేంద్రన్, శివ అనంత్ నిర్మిస్తున్నారు.



## 'అన్నపూరణి' స్ట్రీమింగ్ నిలిపివేత

లేడీ సూపర్ స్టార్ నయనతార తాజాగా నటించిన చిత్రం 'అన్నపూరణి'. నయన్ కెరీర్‌లో 75వ సినిమాగా వచ్చిన ఈ చిత్రానికి నీలేష్ కృష్ణ దర్శకత్వం వహించారు. డిసెంబర్ 1న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపకపోయినా ఓటీటీలో ఆదరణ పొందింది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రానికి సంబంధించి ఓ చేదువార్తను తాజాగా ఆ సంస్థ ప్రకటించింది. ఈ సినిమా స్ట్రీమింగ్‌ను నిలిపివేస్తున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. ఈ చిత్రం శ్రీరాముడిని కించపరిచేలా ఉందంటూ ముంబయి పోలీసులకు ఫిర్యాదు అందింది. శ్రీరాముడు మాంసాహారి అని, ఇది వాల్మీకి అయోధ్య కాండలో ఉంది అంటూ ఈ సినిమాలో ఓ డైలాగ్ ఉంటుంది. ఇటీవల ఈ సినిమా చూసిన మహారాష్ట్రకు చెందిన శివసేన మాజీ నేత రమేశ్ సోలంకి మూవీలోని కొన్ని సన్నివేశాలపై అభ్యంతరం తెలుపుతూ ముంబయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హీరో ముస్లిం అయి ఉండటం, హీరోయిన్ బ్రాహ్మణ కుటుంబానికి చెంది ఉండటంతో లవ్ జీహాద్‌ను ప్రోత్సహించేలా ఉందని, ఈ చిత్ర నిర్మాతలపై చర్యలు తీసుకోవాలని రమేశ్ సోలంకి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలావుండగా ఈ సినిమాపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. పలు చోట్ల కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో 'అన్నపూరణి' సినిమా స్ట్రీమింగ్‌ను నిలిపివేస్తున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. .

### ఈ స్వాతంత్ర్యం రాజకీయ నాయకులదే



సూర్య అయ్యలసోమయాజుల, ధన్యా బాలకృష్ణ జంటగా నటించిన చిత్రం 'రామ్ (RAM-ర్యాపిడ్ యాక్షన్ మిషన్). మిహిరామ్ వైనతేయ దర్శకుడు. ఆయనే ఈ మూవీకి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించారు. దీపికాంజలి వడ్లమాని నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను 'సైంధవ్' డైరెక్టర్ శైలేష్ కొలను ఆవిష్కరించారు. 'ఈ 60 ఏళ్ల స్వాతంత్ర్యం ప్రజలది కాదు.. అధికారులది కాదు.. రాజకీయ నాయకులది మాత్రమే' అంటూ శుభలేఖ సుధాకర్ చెప్పిన డైలాగ్ ట్రైలర్‌లో ఆకట్టుకుంది. కమర్షియల్, యాక్షన్, పేట్రియాటిక్ జానర్‌లో రాబోతున్న ఈ సినిమాలో భానుచందర్, సాయికుమార్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

## జీవితాంతం అదే పంథాలో కొనసాగుతా

విధిని బలంగా విశ్వసిస్తారు అగ్ర హీరో వెంకటేష్. ఏ రంగంలో ఉన్నా నిజాయితీగా పనిచేయాలని, ఫలితం గురించి ఏమాత్రం ఆలోచించొద్దని చెబుతుంటారు. ఆయనతో ఇంటర్వ్యూ అంటే ఆద్యంతం సరదాగా, అక్కడక్కడా ఆధ్యాత్మిక అంశాల చర్చతో సాగిపోతుంది. ఆయన నటించిన 75వ చిత్రం 'సైంధవ్' ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. శైలేష్ కొలను దర్శకుడు. ఈ సందర్భంగా గురువారం వెంకటేష్ పాత్రికేయులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ విశేషాలివి..



- నా దృష్టిలో 75 అనేది ఓ నెంబర్ మాత్రమే. అందుకే ఈ సినిమా విషయంలో ఏమాత్రం ఒత్తిడిగా ఫీలవలేదు. ఆ సమయానికి మన వద్దకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని నిజాయితీగా కష్టపడాలన్నదే నా తత్వం. ప్రతీ సినిమా నాకు ప్రత్యేకమే. కెరీర్‌లో ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది.
- 'సైంధవ్' కథలో మనసును కదిలించే డాటర్ సెంటిమెంట్ ఉంటుంది. తండ్రీ కూతురు అను బంధం నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ఎమోషనల్‌గా సాగుతాయి. యాక్షన్ ఘట్టాలు చాలా సహజంగా అనిపిస్తాయి. రేసీ స్క్రీన్‌ప్లేతో ఈ సినిమా సాగుతుంది. ఇప్పటివరకు ఇలాంటి బ్యాక్‌డ్రాప్‌లో నేను సినిమా చేయలేదు.
- ఈ సినిమా క్లైమాక్స్‌ను అద్భుతంగా డిజైన్ చేశారు. పతాక ఘట్టాల్లో వచ్చే సన్నివేశాలన్నీ ఉద్వేగాల్ని పంచుతాయి. యాక్షన్ సీక్వెన్స్ కూడా మునుపెన్నడూ చూడని రీతిలో ఉంటుంది. ఈ అంశాలన్నీ సినిమాకు ఓ కొత్తదనాన్ని తీసుకొచ్చాయి.
- 'ధర్మచక్రం' సినిమాతో 'సైంధవ్'కు ఎలాంటి పోలిక ఉండదు. రెండూ పూర్తి విభిన్నమైన చిత్రాలు. ఈ సినిమాలో నవాజుద్దీన్ సిద్ధిఖీతో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చింది. ఆయన విలక్షణ నటుడు. ఈ సినిమాలో అద్భుతమైన పర్‌ఫార్మెన్స్ కనబరిచాడు.
- ఈ సినిమా కోసం దర్శకుడు శైలేష్ 'ఇంద్రప్రస్థ' అనే ఫిక్షనల్ సిటీని సృష్టించాడు. మాఫియా, డ్రగ్స్, గన్ కల్చర్ కలబోతగా ఆ నగర సెటప్ మొత్తం హాలీవుడ్ సినిమా తరహాలో ఉంటుంది. ఇక సంతోష్ నారాయణ సందర్భోచితంగా చక్కటి పాటలిచ్చారు. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కథలోని ఫీల్‌ను క్యారీ చేస్తుంది.
- 75 సినిమాల ప్రయాణంలో ఎక్కడా ఒక్క వివాదం లేకుండా ఎలా ఉన్నారని చాలా మంది నన్ను అడుగుతున్నారు. నిజంగా ఆ విషయం నాకు తెలియదు (నవ్వుతూ). చిన్నతనం నుంచే ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా, అసౌకర్యం కలిగించకుండా ఉండాలనే మనస్తత్వం నాది. జీవితాంతం అదే పంథాలో సాగుతాను.
- 'స్వామి వివేకానంద' స్క్రిప్ట్ ఓ లెవల్ వరకు వచ్చింది. ఇద్దరు మేకర్స్ చేస్తున్నారు. అయితే స్క్రిప్ట్ ఇంకా పూర్తి సంతృప్తిగా రాలేదు. నా తదుపరి సినిమా ఇంకా ఖరారు కాలేదు. రెండు మూడు కథలు చర్చల దశలో ఉన్నాయి. త్వరలో ఆ వివరాలను వెల్లడిస్తా.










